**తండ్రి పేరిట ఆఫీసు అడ్రసుకు వచ్చిన ఆ ఉత్తరం చదివి ఆశ్చర్యపోయాడు రామారావు. లాయర్ రాఘవరావు రామారావు తండ్రి దశరథరామయ్యకు వ్రాసిన ఉత్తరమది. 'తండ్రి తనకు తెలీకుండా అంత డబ్బు దాచాడా?' ఆలోచనలో పడ్డాడు రామారావు. 'తనంటే తండ్రికి ఎంతో ప్రేమ! మరి ఇలా ఎందుకు చేశాడో?**

'వృద్ధాప్యంలో ఆయనను తను నిర్లక్ష్యం చేస్తున్నాననా? లేక దూరంగా ఎక్కడో బ్రతుకుతున్న కూతుర్ని ఆదుకుందామనా? ఏది ఏమైనా ఈ రహస్యం తెల్సుకుని, ఆ డబ్బు రాబట్టుకోవాలంటే తండ్రిని కొన్నాళ్ళపాటు పువ్వుల్లో పెట్టి పూజించాల్సిందే!' ఆఫీసు నుంచి క్లబ్ కెళ్ళి, రాత్రి పది గంటలకు తండ్రి కోసం ఆపిల్స్ తీసుకుని ఇంటికి బయలుదేరాడు రామారావు. చలిగాలికి ఒళ్ళు గజగజ వణికిపోతున్నది.

వరండాలో ఓ మూల మంచంపై చలికి ముడుచుకుని పడుకుని వున్న తండ్రిని చూడగానే రామారావుకి తన బాల్యం జ్ఞప్తికొచ్చింది.

'ఆ రోజుల్లో పక్కింటి సురేష్ స్వెట్టర్ చూసి అలాంటిదే తనకు కావాలని అలిగి, భోజనం మానేసి కూర్చుంటే అప్పటికప్పుడు తండ్రి పట్నమెళ్ళి పువ్వుల స్వెట్టరు, రగ్గు తెచ్చిన' దృశ్యం కళ్ళ ముందు మెదిలింది.

ఇంట్లో కెళ్ళి నిద్రపోతున్న భార్యను తట్టి లేపి అడిగాడు.

"సీతా! మా నాన్న భోం చేశాడా?" ఎన్నాళ్ళకో తండ్రి భోజనం గురించి కొడుకు అడిగిన ప్రశ్న.

"లేదు" సీత పడుకునే జవాబు చెప్పింది.

"ఎందుకని?"

"ఏమో! రాత్రిళ్ళు తినటం లేదు" భర్త ప్రశ్నలకు ఆశ్చర్యపోతూ అన్నది.

"పోనీ, టిఫిన్ ఏమైనా చేసిపెడుతున్నావా? అదీ లేదా?"

"మనిషికో రకం చెయ్యాలంటే నా వల్ల కాదు బాబూ!" పదిమందికి వండి, వడ్డించలేక కష్టపడిపోతున్న ఇల్లాలులా చెప్పింది.

"రేపట్నుంచి అలా కుదరదు"

"అలాగయితే ఓ మనిషిని పెట్టుకొని చేయించుకోండి, అంతేకానీ నా వల్ల మాత్రం కాదు"—పదిహేను వేల రూపాయిల కట్నమిచ్చి రామారావు చేత ఆ మూడుముళ్ళు వేయించుకున్న సీత ఖరాఖండిగా చెప్పింది.

"ఓసి పిచ్చిమొద్దూ! నేనెందుకు చెప్తున్నానో అర్థం చేసుకో" అంటూ లాయర్ రాఘవరావు వ్రాసిన ఉత్తరంలోని విషయం సీతకు చెప్పేశాడు రామారావు. సీత మొహం పెట్రొమాక్స్ లైట్‌లాగా వెలిగింది.

"అయితే, రేపే మీరా లాయర్‌తో మాట్లాడి రండి" అంది సీత ఆశగా.

"నీ మొహం! మనమిప్పుడే వెళ్ళినా ఆయన చెప్తాడని గ్యారంటీ ఏముంది? పైగా మనం ఆస్తి

# పితృదేవోభవ

## నారాయణమూర్తి

రాబట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నట్టు తెలిసిపోతుంది. అందుకని ముందు నాన్నను ప్రసన్నం చేసుకోవాలి. అన్నట్లు మొన్న తెచ్చిన ఆ రగ్గు ఏదీ?" లుంగీ కట్టుకుంటూ అడిగాడు.

"బీరువాలో ఉంది. ఎందుకు?"

"మా నాన్న కిచ్చిరా. ఆ యాపిల్స్ కూడా ఇయ్యి!"

ఖరీదైన ఆ రగ్గును ముసలి మామగారికి ఇవ్వటానికి సీతకు మనసొప్పలేదు. కానీ ఇవ్వక తప్పలేదు.

"మామయ్యగారూ!" సీత రెండుసార్లు పిలిచింది.

"ఏమిటమ్మా" దశరథరామయ్య అడిగాడు.

"మీ అబ్బాయి రగ్గు తెచ్చారు, కప్పుకోండి" మంచంపై పెట్టి అంది.

"మీరు భోజనం చేశారామ్మా?" కోడలిని అడిగాడు.

"లేదండీ! ఆయనిప్పుడే వచ్చారు. మీరు ఈ ఆపిల్స్ తీసుకోండి" చేతిలో పెట్టి ఇంట్లో కెళ్ళింది.

అకస్మాత్తుగా కోడలుపిల్లలో వచ్చిన మార్పుకు కారణమేమిటో బోధపడలేదు అరవై అయిదేళ్ళ దశరథరామయ్యకు.

* * *

రోజులు గడుస్తున్నాయి.

ఇప్పుడు రామారావు తండ్రి ఆరోగ్యం గురించి స్వయంగా అడిగి తెల్సుకుంటున్నాడు. తండ్రి పట్ల అమితమైన శ్రద్ధాసక్తులు చూపిస్తున్నాడు.

సీత కూడా గతంలోలాగా విసుక్కోకుండా మామగారికి సేవలు చేస్తున్నది. ఆయన కోసం రాత్రిళ్ళు ప్రత్యేకంగా ఫలహారాలు తయారు చేస్తున్నది. తీరిక వేళల్లో మామగారి వద్ద కూర్చుని న్యూస్‌పేపర్‌లోని విశేషాలు చదివి వినిపిస్తున్నది. రామారావు తండ్రి సంతృప్తి కోసం చెల్లెల్ని పిలుచుకొచ్చి, ఓ వారం రోజులు ఉంచుకుని చీర పెట్టి పంపించాడు.

నెల రోజులు గడిచి పోయాయి.

దశరథరామయ్య కొడుకు, కోడలి ప్రవర్తనలోని మార్పుకు లోలోన సంతోషపడ్డాడు. 'వృద్ధాప్యంలో ఏ తండ్రి అయినా తనయుల మంచి ఆశించే ఆదరణ కరువై ఇంతకాలం తానెంతగా కుమిలిపోయాడో?

ఇక తనకే దిగులూ లేదు! ఈ జీవితం ఇలా ముగిసిపోతే చాలు' అనుకున్నాడు దశరథ రామయ్య.

అలాగే...ఓ రోజు హఠాత్తుగా కన్ను మూశాడాయన.

సీత, రామారావు ఎంతగానో బాధపడ్డారు. ఆయన అకస్మాత్తుగా మరణించినందుకు కాదు! ఆఖరి రోజుల్లో కూడా ఆస్తిపాస్తుల గురించి ఒక్క మాటైనా చెప్పనందుకు!

* * *

తండ్రి కర్మకాండ ఘనంగా జరిపించి, రామారావు లాయర్ రాఘవరావు వద్ద కెళ్ళాడు.

తన తండ్రి వద్ద విద్య నభ్యసించిన రఘు, లాయర్ రాఘవరావు ఒక్కరే కావటంతో రామారావు సంతోషపడ్డాడు.

పలకరింపులు మామూలుగానే జరిగిపోయాయి.

"ఏమిటి విశేషం? ఏదైనా కేస్ టేకప్ చేయాలా?" రాఘవరావు అడిగాడు.

"నో! నో! మా నాన్న తన వీలునామా మీ వద్ద దాచాడట కదా?"

"అలాంటిదేమీ లేదే!?"

ఊహించని ఆ జవాబుకు రామారావు అదిరి పడ్డాడు.

తండ్రి కోసం ఖర్చు పెట్టిన కరెన్సీ నోట్లు కళ్ళముందు మెదిలాయి. రాఘవరావు ఏదో దాస్తున్నాడనిపించింది.

"చూడు మిస్టర్ రాఘవరావు, నువ్వు మా నాన్నకు వ్రాసిన ఉత్తరానికి అర్థమేమిటో చెప్ప గలవా?" జేబులో నుంచి తన ఆఫీసుకు వచ్చిన ఉత్తరాన్ని టేబుల్‌పై పడేస్తూ ఆవేశంగా అడి గాడు.

రాఘవరావు ఆ ఉత్తరంకేసి చూసి మంద హాసం చేశాడు.

"యస్! ఆ లెటర్ నేనే వ్రాశాను, కానీ అందులో వ్రాసినట్లుగా మీ నాన్నగారు నా వద్ద ఏ వీలునామా దాచలేదు" తాపీగా చెప్పాడు.


"మరి? మరి? నువ్వెందుకలా వ్రాశావ్?" రామారావు దాదాపుగా అరిచాడు.

"మిస్టర్ రామారావ్! ఒక్కసారి గతాన్ని గుర్తు తెచ్చుకో! ఎంతో గారాబంగా నిన్ను పెంచి, విద్యా బుద్ధులు నేర్పించి, నీకో ఉద్యోగం వేయించిన తండ్రికి నువ్వు చేసిందేమిటి?

ఏనాడైనా నీ తండ్రి ఆరోగ్యం గురించి తెల్సుకొన్నావా? నీ భార్య సంపాదన లేని నీ తండ్రిని హీనంగా చూస్తుంటే, నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తుంటే నువ్వు చేసింది ఏమిటి? జీవిత చరమాంకంలో వున్న తండ్రిపట్ల నీ ప్రవర్త నేమిటి? దేవుడు లాంటి ఆయన్ని మీరు ఆదరిం చటం లేదని తెల్సుకొని, డబ్బు కోసం కక్కుర్తి పడే నీకు దశరథరామయ్యగారు ఎవ్వరికీ తెలీ కుండా దాచిన లక్ష రూపాయలు తన తదనంత రం వృద్ధాప్యంలో తనని సంరక్షించిన వారికి చెందేటట్లు వీలునామా వ్రాశాడనే అబద్ధాన్ని సృష్టించి, లెటర్ ద్వారా తెలిసేలా చేశాను!

నేను అనుకున్నట్లే మాస్టరుగారు తన కొడుకు, కోడలిలో మార్పు వచ్చిందనే సంతృప్తితో కన్ను మూశారు.

అనాథనైన నన్ను మాస్టారు తండ్రిగా, గురువుగా ఆనాడు చేరదీసి ఆదరించారనే కృత జ్ఞతా భావంతో నేనే అలా చేశాను" రఘు ఆవేశంగా చెప్తుంటే, రామారావు ముఖం వాడి పోయింది. రఘు కళ్ళలోకి చూడలేక తల వంచుకున్నాడు.



రఘు మాటలు చెవుల్లో గింగురు మంటు మంటుంటే, తన ఉన్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన తండ్రి రూపం కళ్ళ ముందు మెదులుతుంటే, ఇన్నాళ్ళ తన ప్రవర్తనకు తనపై తనకు అసహ్యమేసింది రామారావుకు.

గుండె లోతుల్లోంచి పశ్చాత్తాపం పెల్లుబుకు తుంటే, సిగ్గుతో భారంగా అడుగులు వేస్తూ బయటకొచ్చాడు రామారావు. ●